సాక్షి
సంగారెడ్డి

ఆదివారం । 12 । జనవరి । 2025

రెడీమేడ్ పిండి వంటలు

సంక్రాంతి అంటే ముత్యాల ముగ్గులే కాదు.. నోరూరించే పిండి వంటలు కూడా. ఒకప్పుడు సంక్రాంతి పండుగ వస్తుందంటే వారం రోజుల ముందు నుంచే ఇళ్లలో పిండి వంటలతో హడావుడి మొదలయ్యేది. పల్లె, పట్టణాలంతా ఘుమ ఘుమ వాసనలు గుబాళించేవి. మారుతున్న కాలానికి అనుగుణంగా బిజీ లైఫ్‌లో చాలా చోట్ల పిండి వంటల తయారీ చేయడం మానేశారు. దీంతో రెడీమేడ్ వంటలకు డిమాండ్ పెరిగింది.

సండే స్పెషల్

8లో

– సాక్షి, సిద్దిపేట /హుస్నాబాద్/ ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)



న్యూస్‌రీల్

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

నేతన్నల భద్రత, భరోసా, అభయహస్తం వంటి పథకాలపై హర్షం



జోగిపేటలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న చైర్మన్, కార్మికులు

జోగిపేట(అందోల్): చేనేత కార్మికుల సంక్షేమ కోసం నేతన్నల భద్రత, నేతన్న భరోసా, అభయ హస్తం వంటి పథకాలను ఈ సంవత్సరం ప్రవేశపెట్టబోతున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించడం పట్ల శనివారం జోగిపేటలోని చేనేత సహకార సంఘంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా చేనేత సహకార సంఘం చైర్మన్ అశోక్ మాట్లాడుతూ...ప్రభుత్వం ప్రకటించిన పథకాల మార్గదర్శకాలను త్వరలోనే ప్రకటిస్తారన్నారు. నేతన్న చేయూత పథకానికి రెండు సంవత్సరాలు తగ్గించి మళ్లీ పథకాన్ని మొదలు పెట్టనున్నారని, నేతన్న బీమా, నేతన్న భరోసా పథకాల్లో వీవర్స్‌కు రూ.18వేలు, వర్కర్లకు రూ.6వేల చొప్పున చెల్లిస్తామని సీఎం ప్రకటించినట్లు తెలిపారు. జోగిపేట సంఘానికి యారాన్లు, మరమగ్గాలు మంజూరు చేయాలని మంత్రి దామోదర్‌ను కోరారు. కార్యక్రమంలో కార్మికులు సంఘ నాయకులు యాదగిరి దుర్గారాం, పుల్లం శ్రీనివాస్,లక్ష్మి,మల్లమ్మ, సువర్ణ, నారాయణలు పాల్గొన్నారు.

పద్మశాలీలు ఐక్యంగా ఉండాలి

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

సదాశివపేట(సంగారెడ్డి): పద్మశాలీలు ఐక్యంగా.. అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని చేనేత సహకార సంఘం భవనంలో పద్మశాలీ సేవా సమాజం పట్టణ నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఈతా వైద్యంకిషోర్, జిల్లా అధ్యక్షుడు వెంకటహరికిషన్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రీడోత్సవాలు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండల కేంద్రంలో సీజీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఓపెన్ టు ఆల్ క్రీడాపోటీలు కొనసాగుతున్నాయి. రెండో రోజు జరిగిన పోటీలకు అదనపు ఎస్పీ సంజీవరావు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. వాలీబాల్ పోటీల్లో ఆయా జట్ల క్రీడాకారులు నువ్వానేనా అన్నట్లుగా తలపడ్డారు. కార్యక్రమంలో నాయకులు నరసింహారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, దేవేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మోహన్‌రెడ్డి, బలరాంరెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

సొంతగూటికి వీఆర్వోలు

ఇప్పటివరకు 416 మంది దరఖాస్తు

- 35 సర్వేయర్... 381 గ్రామ అధికారుల పోస్టులపై ఆసక్తి
- విద్యార్హతల ఆధారంగా ఆన్‌లైన్‌లో వివరాల సేకరణ
- గ్రామ రెవెన్యూ సేవల పునరుద్ధరణ చర్యలు చేపట్టిన సర్కార్
- ఇటీవల కలెక్టర్‌ను కలసిన రెవెన్యూ ఉద్యోగుల సంఘం నేతలు



ఇటీవల సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద రెవెన్యూ ఉద్యోగుల సంఘం నేతలు (ఫైల్)

సంగారెడ్డి జోన్: రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థ పునరుద్ధరణ చర్యలు చేపట్టింది. గత ప్రభుత్వ హయాంలో వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేసి, ఇతర శాఖల్లో సర్దుబాటు చేసింది. ప్రస్తుతం గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థను తిరిగి అమలు చేయనుంది. అందులోభాగంగానే ప్రతీ రెవెన్యూ గ్రామానికి ఓ అధికారిని నియమించనుంది. పాత ఉద్యోగుల నుంచి వారి ఆసక్తి మేరకు వీఎల్‌వోతో పాటు సర్వేయర్ ఉద్యోగాలకు దరఖాస్తులను స్వీకరించింది.

రద్దు చేసిన గత ప్రభుత్వం

జిల్లాలో 27 మండలాలు, 646 గ్రామ పంచాయతీలు ఉండగా, 602 రెవెన్యూ గ్రామాలున్నాయి. గత ప్రభుత్వంలో జిల్లాలో సుమారు 700కుపైగా వీఆర్ఏలను, 250కు పైగా వీఆర్వోలను ఇతర శాఖల్లోకి సర్దుబాటు చేశారు. 2022 ఆగస్టు 1న జిల్లాలోని వీఆర్వోలను రెవెన్యూతోపాటు ఇతర శాఖల్లో సర్దుబాటు చేశారు. 2023 ఆగస్టు 10న వీఆర్ఏలను రద్దు చేస్తూ రెవెన్యూతోపాటు ఇతర శాఖలకు కేటాయించారు. ఇతర శాఖలకు కేటాయించిన ఉద్యోగులు ఈ సర్దుబాట్లను ప్రారంభంలో వ్యతిరేకించారు.

మొత్తం 416 దరఖాస్తులు...

జిల్లాలో మొత్తం 416 దరఖాస్తులు రాగా 35 సర్వేయర్ పోస్టు కోసం, 381 గ్రామ రెవెన్యూ అధికారి పోస్టు కోసం ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకున్నారు. ఆసక్తి ఉన్న ఉద్యోగుల విద్యార్హతల ఆధారంగా సర్వేయర్‌తోపాటు వీఎల్‌వోలుగా నియమించనున్నారు. జిల్లాలో వచ్చిన దరఖాస్తులను ఆసక్తి ఉన్న ఉద్యోగం, వారి విద్యార్హత తదితర వివరాలను వేర్వేరుగా విభజిస్తున్నారు. సర్వేయర్ ఉద్యోగం కోసం డిగ్రీతోపాటు మ్యాథ్స్ సబ్జెక్ట్ కలిగి ఉండాలని చెబుతున్నారు. కాగా, ఇతర శాఖలకు కేటాయించిన రెవెన్యూ ఉద్యోగులను తిరిగి సొంత శాఖకు తీసుకురావడాన్ని రెవెన్యూ ఉద్యోగ సంఘం నేతలు స్వాగతిస్తూ ఇటీవల కలెక్టర్ క్రాంతిని కలిసిన సంగతి తెలిసిందే.

పునరుద్ధరణ ప్రక్రియ చేపట్టిన సర్కార్

కాంగ్రెస్ ప్రభుత్వం పాత వీఆర్వో, వీఆర్ఏ ఉద్యోగుల సేవలను తిరిగి రెవెన్యూ శాఖలో వినియోగించుకునేందుకు చర్యలు తీసుకుంటోంది. అందులోభాగంగానే ఈ ప్రక్రియను వేగవంతం చేసింది. ఆసక్తి ఉన్న ఉద్యోగుల నుంచి ఆన్‌లైన్‌లో వివరాలను సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో గతేడాది డిసెంబరు 24 నుంచి 28 వరకు దరఖాస్తులను స్వీకరించారు. వివరాల సేకరణలో భాగంగా రెవెన్యూశాఖలో చేరిన తేదీ, ప్రస్తుతం నిర్వహిస్తోన్న ఉద్యోగం, ఏ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు? ఏ జిల్లాలో పని చేయాలనుకుంటున్నారు? విద్యార్హతలు, మొబైల్ నంబరుతో పాటు పూర్తి వివరాలు తీసుకుంటున్నారు.

ఓబన్న ఆశయ సాధనకు కృషి



ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి జోన్: బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయ స్వాతంత్ర్య సమరయోధుడు ఒడ్డె ఓబన్న ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. శనివారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి, ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...అందరికీ స్వేచ్ఛ, సమానత్వం, గౌరవం కల్పించాలనే ఆశయంతో పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడు ఓబన్న అని అన్నారు. ఆయన జీవితం నుంచి అందరూ స్ఫూర్తి పొందాల్సిన అవసరం ఉందని చెప్పారు.

అర్హులైన వారిని ఎంపిక చేయాలి

రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు అర్హులైన వారినే ఎంపిక చేయాలని కలెక్టర్ క్రాంతి స్పష్టం చేశారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26 నుంచి పథకాలను అమలు చేయనున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో వివిధ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 21 నుంచి 24 వరకు పంచాయతీల పరిధిలో గ్రామ సభలను, మున్సిపల్ పట్టణాలలో వార్డు సభలను నిర్వహించాలని సూచించారు. భూభారతి (ధరణి) పోర్టల్‌లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూమి విస్తీర్ణం ఆధారంగా రైతు భరోసా పథకం కింద అర్హులైన వారిని గుర్తించాలని ఆదేశించారు. ఈనెల 20వ తేదీ లోపు క్షేత్రస్థాయి సందర్శన ప్రక్రియను పూర్తి చేయాలని గడువు విధించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, పీడీ డీఆర్డీఏ జ్యోతి, జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్, జెడ్పీ సీఈవో జానకిరెడ్డి, వివిధ శాఖల అధికారులు, సహాయ బీసీ సంక్షేమాధికారి కె.భాగ్య లక్ష్మి, జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు లింగయ్య, సంఘం నాయకులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని వివిధ కాలనీల్లో కోటి రూపాయల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మున్సిపల్ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. రూ.8 లక్షల నిధులతో రెండు అంగన్‌వాడీ కేంద్రాలను రెనోవేట్ చేసిన కోకోకోల సంస్థను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాండు రంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహగౌడ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

చిదిమేసిన చక్రాలు

- ఎడ్లబండి కిందపడి ఒక బాలుడు.. ట్రాక్టర్ కిందపడి మరొకరు
- పండుగ ముందు రెండు కుటుంబాల్లో విషాదం



సీసీ పుటేజీలో నడుచుకుంటూ వెళుతున్న బాలుడి దృశ్యం



జోగిపేట ఆసుపత్రిలో శ్రీరామ్ మృతదేహం



నితిన్ నాయక్ మృతదేహం

నారాయణఖేడ్/జోగిపేట (అందోల్): ఆనందం అర్ణవమైతే అనురాగం అంబరమైతే అనురాగపు టంచులు చూస్తాం ఆనందపు లోతులు చూస్తాం అంటుంది బాల్యం..అదే పండుగపూటైతే వారి ఆనందం మాటల్లో వర్ణించలేనిది. కానీ, పండుగ ముందే రెండు కుటుంబాల్లో ఆనందాన్ని ఆవిరిచేసి కన్నీళ్లను నింపాయి రెండు ప్రమాదాలు. చెరుకు ఎడ్ల బండి చక్రాల కింద నలిగి ఒక బాలుడు, పతంగి కోసం వెదుక్కుంటూ ఆదమరిచి ట్రాక్టర్ చక్రాల కింద నలిగి మరో బాలుడు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు వారి అంతులేని విషాదాన్ని నింపాయి. వివరాలిలా ఉన్నాయి.

ఆడుకుంటూ ఎడ్లబండి కిందికి వెళ్లి....

జిల్లాలోని నారాయణఖేడ్ మండలం గైరాన్‌తండాకు చెందిన విజయ్ కుమార్, సుమిత్రాబాయి దంపతులు. వీరికి ఐదేళ్ల కుమారుడు నితిన్. కొద్దినెలలక్రితం తండావాసులతో కలసి వీరంతా చెరుకు నరికేందుకు కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లాకు వలస వెళ్లారు. ఈ క్రమంలో శనివారం ఆ జిల్లాలోని శివరాంపూర్ గ్రామ శివారులో ఓ రైతుకు సంబంధించిన చెరుకుతోటను నరుకుతున్నారు. ఇదే సమయంలో నితిన్ కుమార్ పాలం పక్కనే ఓ ఎడ్ల బండి కింద ఆడుకుంటున్నాడు. నరికిన చెరుకును ఎద్దులబండిపై చక్కెర ఫ్యాక్టరీకి తరలిస్తున్న క్రమంలో అదే బండి కిందనే ఆడుకుంటున్న నితిన్‌పైనుంచి వెళ్లిపోయింది. దీంతో నితిన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు ప్రాణాలు కోల్పోవడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. బాలుడి అంత్యక్రియలు గైరాన్‌తండాలో నిర్వహించారు.

పతంగి కోసం పరిగెడుతూ...

మెదక్ జిల్లా టేక్మాల్ మండల కేంద్రానికి చెందిన నీరుడి జ్యోతి కుమారుడు శ్రీరామ్ (9) శనివారం తోటి స్నేహితులతో కలసి పతంగులు కొనుక్కునేందుకు జోగిపేట వచ్చాడు. ఈ క్రమంలో నలుగురు చిన్నారులు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఓ దుకాణంలో పతంగులు కొనుగోలు చేశారు. అక్కడ్నుంచి బస్టాండ్‌కు వచ్చే దారిలో పతంగి కోసం పరిగెడుతూ ఎదురుగా వేగంగా వస్తున్న ట్రాక్టర్ కిందికి వెళ్లిపోయాడు. దీంతో ట్రాక్టర్ చక్రం కింద నలిగిపోయిన బాలుడు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. దీంతో వెంట ఉన్న ముగ్గురు చిన్నారులు భయపడి పారిపోయారు. కాగా, బాలుడి ఎవరనేది పోలీసులకు సమాచారం లేకపోవడంతో ప్రమాదం జరిగిన ప్రాంతంలోని సీసీ పుటేజీని స్థానికంగా ఉన్న అన్ని గ్రూపులకు పంపించగా అతడిని మెదక్ జిల్లా టేక్మాల్ మండల వాసిగా గుర్తించారు.

విహారం.. విషాదం

- హాలిడే ట్రిప్‌కు వస్తే అనంత లోకాలకు
- కొండపోచమ్మసాగర్ ఘటనలో ఐదుగురు మృతి



ప్రమాదానికి ముందు నీటిలో యువకుల సరదా

గజ్వేల్/మర్కూక్/ములుగు: హాలిడే కావడంతో స్నేహితులు అంతా ఒకచోట చేరారు. ట్రిప్‌కు వెళ్దామని బయలుదేరి కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్ వద్దకు చేరుకొని ఆటలాడారు. సెల్ఫీలు దిగారు. ఈ ఆనంద క్షణాలు ముగిసేలోపే ఏడుగురిలో ఐదుగురైన హైదరాబాద్‌లోని ముషీరాబాద్ ప్రాంతంలోని ఇందిరానగర్‌కు చెందిన ధనుష్ (20), లోహిత్ అలియాస్ లక్కీ(17), కవాడిగూడకు చెందిన చీకట్ల దినేశ్వర్ (18), ఖైరతాబాద్‌కు చెందిన జతిన్(17), అత్తాపూర్‌లోని జనప్రియనగర్ కాలనీకి చెందిన సాహిల్ నీట మునిగి మృతిచెందారు. ముషీరాబాద్‌లోని రాంనగర్‌కు చెందిన మృగాంక్, ముషీరాబాద్‌కు చెందిన ఎండీ ఇబ్రహీం ప్రాణాలతో బయటపడ్డారు.

రక్షణ చర్యలు ఏవీ..?

కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్ సందర్శకులకు రక్షణ చర్యలు కరువవడంతో ఎంతోమంది మృత్యుఒడికి చేరుకుంటున్నారు. హైదరాబాద్ నగరానికి ఈ రిజర్వాయర్ సమీపంలో ఉండటంతో సెలవు రోజుల్లో అధికంగా సందర్శకులు వస్తుంటారు. ఈ సందర్భంలో కనీస రక్షణ చర్యలు కరువయ్యాయి. కొన్నేళ్లుగా సుమారు 30 మంది వరకు ఈ రిజర్వాయర్లో ప్రాణాలు కోల్పోయారు. రిజర్వాయర్ చుట్టూ 15.5 కిలోమీటర్ల పొడవునా కట్ట ఉంది. కట్టపై తారు రోడ్డు వేశారు. ఈ రోడ్డుపై నుంచి రాతి కట్టలపై నుంచి నీళ్లలోకి సందర్శకులు దిగడం సర్వసాధారణగా మారింది. ఇలాంటి సందర్భంలో రిజర్వాయర్లో ఎత్తు, లోతు ప్రదేశాలను గుర్తించడం కష్టతరంగా మారుతోంది. ఎత్తుగా ఉంది కదా అని సందర్శకులు రాళ్లపై, పక్కనే ఉన్న ఒడ్డుపై నిలబడుతూ సెల్ఫీలు దిగడం, నీళ్లలోకి కాళ్లు పెట్టి ఆటలాడడం పరిపాటి అయ్యింది. సందర్శకులు నీళ్ల పక్కన నిలబడి ఉన్న సందర్భాల్లో భారీ గుంతల జాడ తెలియక అనూహ్యంగా జారిపడి ప్రాణాలు కోల్పోతున్నారు.

కంది సేకరణకు ముమ్మర ఏర్పాట్లు

- జిల్లాలో 10 కేంద్రాల ఏర్పాటు
- 25వేల టన్నుల సేకరణ లక్ష్యం
- 77.110 ఎకరాల్లో కంది పంట సాగు
- డిమాండ్ మేరకు సెంటర్ల పెంపు..
- రూ.7,550 మద్దతు ధర



జహీరాబాద్‌లో ప్రారంభించిన కందుల కొనుగోలు కేంద్రం

నారాయణఖేడ్: రైతుల నుంచి కనీస మద్దతు ధరకు కందులను కొనుగోలు చేసేందుకు మార్క్‌ఫెడ్ సిద్ధమైంది. జిల్లాలో ఇప్పటికే కేంద్రాల ఏర్పాటు ప్రక్రియను ముమ్మరం చేసింది. జిల్లా మొత్తంలో 10 కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఏడాకులపల్లి, సత్వార్, ఝరాసంఘంలలో కేంద్రాలను ఇప్పటికే ప్రారంభించింది. త్వరలో మరిన్ని కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. జిల్లాలో జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్ నియోజకవర్గాల్లో పప్పుదినుసుల సాగు అధికంగా ఉంటుంది. కంది పంట సైతం ఈ నియోజకవర్గాల్లోనే అధికంగా పండిస్తారు. రైతులు గ్రామాల్లో కంది పంట నూర్పిళ్లు ప్రారంభించారు. రైతులు పంట నూర్పిళ్లు చేపట్టడంతో వారి వద్ద నుంచి క్వింటాలుకు రూ.7,200 నుంచి రూ.7,300 చొప్పున దళారులు కొనుగోళ్లు చేపట్టారు.

రూ.7,550 మద్దతు ధర


రైతుల వద్ద కందులను క్వింటాలుకు రూ.7,550ల మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేయనుంది. ఇప్పటికే పంటసాగు చేసి ఆన్‌లైన్‌లో ఉన్న రైతుల వద్ద వారి వివరాల ఆధారంగా కొనుగోళ్లు చేపట్టనుంది. జిల్లాలో నాఫెడ్, డీసీఎంఎస్, పీఏసీఎస్‌ల ద్వారా కొనుగోళ్లు చేసేందుకు మార్క్‌ఫెడ్ ఏర్పాట్లు చేస్తోంది. మరో పది రోజుల్లో దాదాపు జిల్లా మొత్తంలో కేంద్రాలు ప్రారంభం కానున్నాయి. రైతుల డిమాండ్ పెరిగిన పక్షంలో కేంద్రాలు పెంచాల్సిన అవసరం ఏర్పడనుంది.

> **మద్దతు ధరకు కొనుగోలు..**
>
> రైతులకు మద్దతు ధరకు కందులు కొనుగోలు చేసేందుకు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. మొత్తం 10 కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. ఇప్పటికే మూడు కేంద్రాలు ప్రారంభించాం. రైతుల డిమాండ్ మేరకు కేంద్రాల పెంపుపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. దిగుబడి ఎక్కువ వచ్చిన విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.
>
> – శ్రీదేవి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్, సంగారెడ్డి

25వేల టన్నులు టార్గెట్..

జిల్లా మొత్తంలో 77,110 ఎకరాల్లో రైతులు కంది పంటను సాగు చేశారు. మొత్తమ్మీద 25వేల టన్నుల వరకు కందులను కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఎకరాకు 6 నుంచి 8 క్వింటాళ్ల వరకు కంది దిగుబడులు రానున్నాయి. ప్రభుత్వం మాత్రం ఎకరాకు 3.3క్వింటాళ్ల మేర మాత్రమే కొనుగోలు చేయనుంది. ఈ సంఖ్యను పెంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కొనుగోలు చేసిన కందులకు రైతులకు ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు 74గంటల్లో చేపట్టనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఊరుకెళ్తే జర భద్రం!



- అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలి
- ప్రజలకు పోలీసుల సూచనలు
- గస్తీ ముమ్మరం చేస్తాం: డీఎస్పీ

పటాన్‌చెరుటౌన్: సంక్రాంతి సెలవుల నేపథ్యంలో పిల్లా పాపలతో పండుగకు సొంతూళ్లకు లేదా విహారయాత్రలకో తీర్థయాత్రలకో వెళ్తున్నారా? వెళ్తే వెళ్లారుగానీ మీ ఇల్లు మాత్రం దొంగలబారిన పడకుండా ఉండేలా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో దాదాపు నగరంలో ఇక్కడ్నుంచి కొన్ని లక్షలమంది ఊళ్లు వెళ్తుండటం అదునుగా చేసుకుని దొంగలు భారీ చోరీలకు పాల్పడే అవకాశముంది. ఇలాంటి సమయంలో పోలీసులు సైతం దొంగలను గుర్తించలేకపోయే అవకాశం ఉంది. కాబట్టి కొన్ని సొంతూళ్లకు వెళ్తున్న వాళ్లు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఇటువంటి చోరీలు జరగకుండా అడ్డుకోవచ్చని పోలీసులు చెబుతున్నారు. మీ ప్రయాణపు వివరాలను సమీప పోలీసు స్టేషన్లకు లేదా 100కు డయల్ చేసి సమాచారమిస్తే ఆ ఇంటిపై ప్రత్యేక నిఘాతో పాటు ఆయా ప్రాంతాల్లో గస్తీని ముమ్మరం చేస్తామంటున్నారు పోలీసులు.

ఇవీ సూచనలు..

- చోరీలకు వచ్చే దొంగలు ఒకరోజు ముందే పరిసర ప్రాంతాలను పరిశీలిస్తారు. అనుమానాస్పదంగా కనిపించిన వారిపై పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- ఎప్పుడు ఊరికి వెళ్తున్నారు. తిరిగి ఎప్పుడొస్తారు వంటి వివరాలతోపాటు ఇంటి చిరునామా, ఫోన్ నంబర్లు పోలీస్‌స్టేషన్లో సమాచారం ఇవ్వాలి. దీంతో ఆయా ప్రాంతాల్లో గస్తీని మరింత ముమ్మరం చేసేందుకు అవకాశం కలుగుతుంది.
- ఆభరణాలు, నగదు, డాక్యుమెంట్లను బ్యాంకులో భద్రపరుచుకోవాలి.
- ఇంటికి సెంటర్‌లాకింగ్ సిస్టమ్‌తోపాటు కిటికీ తలుపులు లోపలకు వేయాలి. ఇంటివైపు ఓ కన్నేసి ఉంచమని చుట్టుపక్కల వారికి అపార్ట్‌మెంట్‌లో ఉంటే పక్క పోర్షన్ వారికి చెప్పాలి.
- ఇంటికి నాణ్యమైన తాళాలను వాడాలి. ఇంటికి ఒకటి లేదా రెండు తాళాలు వేసుకోవాలి.
- ఇంటి కిటికీలను మూసివేయాలి. వాటికి ఉన్న బోల్టులు, బేడాలు సక్రమంగా ఉన్నాయో లేదో ఎప్పటికప్పుడు చూసుకోవాలి.
- రాత్రి సమయాల్లో ఇంటిముందు, వరండాలో లైట్లు వెలిగేలా ఏర్పాట్లు చేసుకోవాలి.
- వాహనాలు ఇంటి బయట పార్కింగ్ చేసేవారు వాహనాలకు పటిష్టమైన తాళాలను ఏర్పాటు చేసుకోవాలి. ద్విచక్ర వాహనాలకు వీల్‌లాక్ ఏర్పాటు చేసుకోవాలి.
- అపార్ట్‌మెంట్లలో కొత్త వ్యక్తులు వస్తే వారి పూర్తి వివరాలు, ఎవరి ఇంటికి వచ్చారు వంటి అంశాలను నమోదు చేసుకోవాలని వాచ్‌మెన్‌కు కచ్చితంగా చెప్పాలి.
- అపార్ట్‌మెంట్లు, కాలనీల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి. ఇప్పటికే ఏర్పాటు చేసుకున్నవారు అవి సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో నిర్ధారించుకోవాలి.
- రాత్రి సమయంలో కాలనీలో లేదా గ్రామాలలో కొత్త వ్యక్తులు ఎవరైనా వస్తే వారి వివరాలు సేకరించాలి.
- దొంగతనాలు అర్ధరాత్రి నుంచి వేకువజాము 4 గంటల వరకు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఆసమయంలో అపార్ట్‌మెంట్, కాలనీల్లో అసోసియేషన్ ప్రతినిధులు, వాచ్‌మెన్లు, ఇంటి యజమానులు రాత్రి సమయాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలి. ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి

100కు డయల్ చేయండి



ఊళ్లకు వెళ్లే వారు పక్కంటి వారికి సమాచారం ఇచ్చి, వేసిన తాళం బయటకు కనిపించకుండా కవర్ చేయాలి. దీంతోపాటు బంగారు ఆభరణాలను బ్యాంకులో భద్రపరచాలి. పటాన్‌చెరు నియోజకవర్గంలో వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు పోలీస్‌స్టేషన్ నంబర్‌ను సేవ్ చేసుకోవాలి లేదా అత్యవసరమైతే 100కు ఫోన్ చేయాలి.

–డీఎస్పీ రవీందర్ రెడ్డి

క్లుప్తంగా

ఆలయంలో చోరీ


సీసీ ఫుటేజీలో దొంగ

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలో దొంగలు చోరీకి పాల్పడ్డ ఘటన శనివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ మహమ్మద్ గౌస్ కథనం మేరకు.. మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయం ప్రధాన ద్వారం తాళాలు పగులగొట్టిన దొంగలు దేవాలయంలోకి ప్రవేశించారు. అమ్మవారి రెండు ముక్కు పుడకలను దొంగిలించి పక్కనే ఉన్న హుండీని దేవాలయానికి దూరంలో తీసుకెళ్లి ధ్వంసం చేయడంతోపాటు భక్తులు మొక్కుగా సమర్పించి నగదును, ఇతర వస్తువులను ఎత్తుకెళ్లారు. చోరీకి సంబంధించి దొంగల కదలికలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ క్లూస్ టీమ్‌ను రప్పించి దొంగతనానికి సంబంధించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

న్యూఢిల్లీ రిపబ్లిక్‌డే వేడుకలకు వర్గల్ పూలే డిగ్రీ విద్యార్థిని


తెనుగొండ హేమ

వర్గల్(గజ్వేల్): న్యూఢిల్లీలో రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనే అరుదైన అవకాశం సిద్దిపేట జిల్లా వర్గల్ జ్యోతిబా పూలే గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థిని తెనుగొండ హేమకు లభించింది. ఫైనల్ ఇయర్ డిగ్రీ చదువుతున్న హేమ నాలుగో సెమిస్టర్ కళాశాల టాపర్‌గా ప్రతిభ చాటుకుంది. ఈ మేరకు కేంద్ర డిఫెన్స్ విభాగం అధికారులు పీఎం యశస్వీ స్కీమ్ కింద రిపబ్లిక్‌డే వేడుకలను తిలకించేందుకు స్పెషల్ గెస్ట్‌గా ఎంపిక చేసినట్లు అధికారిక లేఖలో పేర్కొన్నారు. ఈ విషయం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్‌రావు ధ్రువీకరించారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

శివ్వంపేట(నర్సాపూర్): అదనపు కట్నం కోసం వేధింపులకు పాల్పడుతున్న భర్త, అత్త పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధి తిమ్మాపూర్ గ్రామానికి చెందిన స్వప్నకు 14 ఏళ్ల కిందట తూప్రాన్ మండలం కోనాయిపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్‌తో వివాహం జరిగింది. కొద్ది రోజుల నుంచి వెంకటేశ్ మద్యానికి బానిసై ఎలాంటి పనులు చేయకుండా అదనపు కట్నం తేవాలంటూ స్వప్నను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. వేధింపులు భరించలేక బాధితురాలు ఫిర్యాదు చేయడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అశ్రునయనాల మధ్య ప్రేమ జంట అంత్యక్రియలు

నారాయణఖేడ్: మునిపల్లి సమీపంలోని హరిత రిసార్ట్స్‌లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ప్రేమజంట అంత్యక్రియలు స్వగ్రామం నిజాంపేట్ మండల కేంద్రంలో శనివారం అశ్రునయనాల మధ్య నిర్వహించారు. నిజాంపేట్‌కు చెందిన ఉదయ్ కుమార్, రోహిత గత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నప్పటికీ ఇరు కుటుంబాల అభ్యంతరం చెప్పడంతో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. మునిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి శవ పరీక్ష అనంతరం మృతదేహాలను వారివారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అంత్యక్రియలు జరిగేటప్పుడు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా నారాయణఖేడ్ ఎస్ఐ శ్రీశైలం ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆత్మహత్యకు ముందే ఇద్దరూ రిసార్ట్‌లో వివాహం చేసుకున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

చోరీకి గురైన ఫోన్లు అందజేత

తూప్రాన్: మండలంలో వివిధ ప్రదేశాల్లో చోరీకి గురైన 10 సెల్ ఫోన్లను బాధితులకు డీఎస్పీ వెంకట్‌రెడ్డి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. విలువైన సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. కేంద్ర టెలీకాం సంస్థ అందుబాటులోకి తీసుకొచ్చిన సీఈఐఆర్ నూతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా గుర్తించి నిందితుల నుంచి సేకరించి బాధితులకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ రంగాకృష్ణ, ఎస్ఐ శివానందంలు పాల్గొన్నారు.


ప్రయాణికులతో కిటకిటలాడుతున్న సంగారెడ్డి కొత్త బస్టాండ్


బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు


చిన్న పిల్లలతో ఇంటికెళ్తూ..


బస్సు ఎక్కటానికి ఎగబడుతున్న జనం


ఫుట్ బోర్డు పై ప్రయాణిస్తున్న యువకులు

జనం ఇంటి బాట.. బస్సులు కిటకిట

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని స్కూళ్లకు, కాలేజీలకు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు ప్రకటించారు. అందరూ తమ తమ సొంతూళ్లకు పయనం కావడంతో ఆర్టీసీ బస్టాండ్లన్నీ జనంతో కిటకిటలాడుతున్నాయి. గంటల తరబడి బస్సుల కోసం వేచి ఉంటున్నారు. బస్సు రాగానే ఎక్కడానికి పరుగులు పెడుతున్నారు. సీటు కోసం కిటికీ నుంచి లోపలికి బ్యాగులు వేస్తున్నారు. బస్సులో నిలబడటానికి కూడా స్థలం లేక మహిళలు, ముసలివాళ్లు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంత మంది ఫుట్ బోర్డు పై వేలాడుతూ వెళ్తున్నారు. స్పెషల్ బస్సులపేరిట ఆర్టీసీ అధికారులు టికెట్ ధరలను అధికంగా పెంచారని ప్రయాణికులు వాపోయారు.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

రెడీమేడ్ పిండి వంటలు

సంక్రాంతి సందర్భంగా అప్పాలు తయారీ ● ఉపాధి పొందుతున్న పలువురు


సకినాలు వేస్తున్న అంజయ్య దంపతులు

వంటకం	ధర (కిలోకు)
సకినాలు	రూ. 280
మురుకులు	రూ. 300
అరిసెలు	రూ. 360
మిగితావి	రూ. 280


సిద్దిపేటలో విక్రయిస్తున్న పిండి వంటలు

- సకినాలు ఇతర దేశాలకు ప్యాకింగ్
- తక్కువ ధరతో రుచికరం, నాణ్యత

సాక్షి, సిద్దిపేట / హుస్నాబాద్/ ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సంక్రాంతి పండుగ సందర్భంగా రెడీమేడ్ దుస్తువుల మాదిరిగానే పిండి వంటలను సైతం కొనుగోలు చేసి సంక్రాంతి పండుగను జరుపుకుంటున్నారు ప్రజలు. దీంతో చాలా మందికి ఉపాధి సైతం లభిస్తోంది. సిద్దిపేట, హుస్నాబాద్, సంగారెడ్డి, పటాన్‌చెరు, మెదక్‌లలో తయారు చేసిన పిండి వంటలు మన ప్రాంతం వారే కాకుండా ఇతర దేశాలకు సైతం ప్యాకింగ్ చేసి పంపిస్తున్నారు. ఇలాంటి వాటిని వ్యాపారంగా చేస్తూ పండుగలు శుభకార్యాల సమయంలో కస్టమర్లకు కావాల్సినవి చేసి విక్రయిస్తున్నారు.


పిండివంటలు తయారు చేస్తున్న మహిళ

సీజన్‌తో సంబంధం లేకుండా..

సిద్దిపేట పట్టణంలో విక్టరీ చౌరస్తా సమీపంలో 20 ఏళ్లుగా పిండి వంటలు తయారు చేసి పెద్ది వీరేశం విక్రయిస్తున్నారు. తొలుత సర్వపిండి తయారు చేసేవారు రాను రానూ కస్టమర్‌ల అర్డర్‌ల మేరకు అప్పాలను చేయడం ప్రారంభించారు. పండుగ సీజన్‌లో ఎక్కువగా.. సాధారణ సమయాల్లో తక్కువగా విక్రయాలు జరుగుతుంటాయి. ఇళ్లలో వినియోగించే నూనెలను తయారీలో వాడుతుండటంతో రుచిగా ఉండటంతో ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడ తయారు చేసి పిండి వంటకాలు అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ దేశాలకు సైతం ఎక్స్‌పోర్ట్ చేస్తుంటారు. పిండి వంటల తయారీ సందర్భంగా సుమారుగా 15 మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు.



25 ఏళ్లుగా పిండి వంటలు

హుస్నాబాద్ పట్టణానికి చెందిన వంగ అంజయ్య, త్రిభువన దంపతులు పిండి వంటలు తయారు చేయడంలో వారికి వారే సాటి. దాదాపు 25 ఏళ్లుగా పిండి వంటలు తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ఒకప్పుడు వివిధ ప్రాంతాల్లో జరిగే జాతరలకు వెళ్లి నాలుగు చక్రాల బండిపై జిలేబీ, మైసూర్‌పాక్, కోవ, ఇలా వివిధ రకాల మిఠాయి పదార్థాలు అమ్ముకుంటూ జీవనోపాధి పొందేవారు. సంక్రాంతి పండుగ సందర్భంగా సకినాల తయారీకి అంజయ్య దంపతులు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నారు. పండుగకు పది రోజుల ముందు నుంచే సకినాలు, అరిసెలు, మురుకులు, గరిజెలు, ఇతర స్వీట్లకు ఆర్డర్లు వస్తున్నాయి. ఎవరి సహాయం లేకుండానే అంజయ్య దంపతులు తమ రెక్కల కష్టంతోనే పిండి వంటలు తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ఇతర దేశాలు, రాష్ట్రాలకు సైతం ఆర్డర్‌లు తీసుకొని ప్యాకింగ్ చేసి పంపిస్తున్నారు.

పిండి వంటలతోనే ఉపాధి



కొన్నేళ్ల నుంచి పిండి వంటలు తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నాం. రుచిలో రాజీ పడకుండా నాణ్యమైన వస్తువులను వాడుతాం. మాపై ఉన్న నమ్మకంతో ఆర్డర్లు ఇచ్చి తమకు ఇష్టమైన పిండివంటలు, తీపి పదార్థాలు తీసుకెళ్తున్నారు. విదేశాల్లో ఉన్న వారు బంధువుల ద్వారా వివిధ రకాల పచ్చళ్లు ఆర్డర్లు ఇస్తున్నారు. ఏ పండుగ వచ్చిన దానికి సంబంధించిన ఆహార పదార్థాలు మా వద్దనే ఆర్డర్లు ఇచ్చి తీసుకెళ్తున్నారు.

- వంగ త్రిభువన, హుస్నాబాద్

అన్ని సమయాల్లో లభిస్తాయి



సిద్దిపేట పట్టణంలో వీరేశం హోమ్ ఫుడ్స్ మొదటి పిండి వంటకాల దుకాణం. 20 ఏళ్ల నుంచి మా హోమ్ ఫుడ్స్ నుంచి అనేక మంది తమ బంధువులకు, తమ ఇంటికి పిండి వంటకాలు తీసుకెళ్తుంటారు. మా దుకాణం లో సకినాలు, గారెలు, అరిసెలు, చె కోడీలు, ఇలా ప్రతీ పిండి వంటకం దొరుకుతుంది. మంచి నాణ్యతగా తయారు చేయడం వల్ల ఇక్కడి నుంచి అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా తదితర దేశాలకు పార్సెల్ ఆర్డర్ వస్తుంటాయి.

- హిమబిందు, వీరేశం హోమ్ ఫుడ్స్ నిర్వాహకురాలు

నాణ్యత, రుచిగా ఉంటాయి



మేము పండుగల సమయంలో ఇక్కడి నుంచే రెడీమేడ్ పిండి వంటలను తీసుకెళ్తాను. ముఖ్యంగా సకినాలు, అరిసెలును తీసుకెళ్తాను. ఇక్కడ మన ఇంట్లో చేసిన విధంగానే నాణ్యతగా, రుచి ఉండడం వల్ల మా కుటుంబీకులు ఇక్కడి పిండి వంటకాలను ఇష్టపడుతారు.

- అశోక్, ముల్కనూరు

మా పిల్లలకు పార్సళ్లు పంపిస్తాను



మా పిల్లలకు ఇక్కడ తయారు చేసిన పిండి వంటకాలు అంటే చాలా ఇష్టం. వారికి ఇక్కడి నుంచే పండుగల సమయంలో పార్సిల్ చేసి పంపిస్తాను. నాకు ఒక్కదానికే పిండి వంటలు చేయడం కాస్త ఇబ్బందిగా ఉండటం వల్ల ఆర్డర్ ఇచ్చి చేసి పంపిస్తాను. ఇక్కడ పిండి వంటకాలు నాణ్యత ఎక్కువ, ధర తక్కువగా ఉండటం వల్ల కొనుగోలు చేస్తా.

- కరుణ శ్రీ, సిద్దిపేట

వేర్వేరు చోట్ల ఇద్దరు బలవన్మరణం

కిడ్నీ సమస్యతో బాధపడుతూ వ్యక్తి


సత్యనారాయణ

చేగుంట(తూప్రాన్): అనారోగ్య సమస్యలతో మనస్తాపం చెంది వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని అనంతసాగర్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మెండె సత్యనారాయణ(51) గ్రామ సేవకుడిగా పని చేసి రెవెన్యూ శాఖ నుంచి ములుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ అయ్యి విధులు నిర్వహిస్తున్నాడు. ఆరు నెలల నుంచి కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మనస్తాపం చెంది ములుగు నుంచి ఇంటికి వెళ్తున్నట్లు కుటుంబీకులకు తెలిపి శుక్రవారం రాత్రి అనంతసాగర్‌కు చేరుకొని ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం విషయం తెలుసుకున్న ఎస్ఐ చైతన్యకుమార్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మానసిక స్థితి సరిగా లేక యువకుడు


రాజశేఖర్ (ఫైల్)

జోగిపేట(అందోల్): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జోగిపేట ఎస్ఐ పాండు కథనం మేరకు.. జోగిపేటకు చెందిన నర్రా రాజశేఖర్ (32) భార్య మమతతో కలిసి 12వ వార్డులో నివాసం ఉంటున్నాడు. రాజశేఖర్‌కి కొద్ది రోజులుగా మానసిక పరిస్థితి బాగా లేక ఇంటి వద్దే ఉంటున్నాడు. ఆస్పత్రిలో చూయించినా తగ్గకపోవడంతో మనస్తాపం చెంది శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కుమారుడి కళ్లెదుటే తండ్రి మృతి

స్కూటీపై వెళ్తుండగా ఢీకొట్టిన లారీ

పటాన్‌చెరు టౌన్: స్కూటీని లారీ ఢీకొట్టడంతో తండ్రి మృతి చెందగా, కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ స్వామి గౌడ్ కథనం మేరకు.. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లికి చెందిన అశోక్(45), తన కుమారుడు మని సంకిత్ (20) ఇద్దరూ కలిసి స్కూటీపై శనివారం రాత్రి పని నిమిత్తం పటాన్‌చెరుకు వచ్చారు. తిరిగి శంకర్‌పల్లికి వెళ్తుండగా పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామ రహదారిపై వెనుకాల నుంచి లారీ ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై తండ్రి అక్కడికక్కడే మృతి చెందగా, కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కూతురి వద్దకు వెళ్తూ తండ్రి మృతి

- బైక్‌ను ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం
- సంక్రాంతి సెలవులు కావడంతో పాఠశాలకు వెళ్తుండగా ప్రమాదం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని నందికంది శివారులో శనివారం చోటు చేసుకుంది. సీఐ మహేశ్ గౌడ్ కథనం మేరకు.. మండలంలోని తంగడపల్లి గ్రామానికి చెందిన గాండ్ల గంగాధర్(36) ఓ పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నాడు. సంక్రాంతి సెలవులు కావడంతో సిద్దిపేటలోని గురుకుల పాఠశాలలో చదువుతున్న కూతురిని హాస్టల్ నుంచి తీసుకురావడానికి బైక్‌పై వెళ్తున్నాడు. నందికంది గ్రామ సమీపంలో వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కారు ఢీకొని మహిళ


లక్ష్మి (ఫైల్)

నంగునూరు(సిద్దిపేట): కారు ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన శనివారం పాలమాకులలో చోటు చేసుకుంది. రాజగోపాల్‌పేట పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ముంద్రాతి లక్ష్మి (57) రోడ్డు పక్కన నిలబడి ఉండగా సిద్దిపేట నుంచి హుస్నాబాద్ వైపు వస్తున్న కారు అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. గ్రామస్తులు ఆమెను ఆటోలో సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి చిన్న కుమార్ వేణువర్ధన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆసిఫ్ తెలిపారు.

బైక్ డివైడర్‌ను ఢీకొని..

తూప్రాన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ఇమాంపూర్ వద్ద 44వ జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం కథనం మేరకు.. శివ్వంపేట మండలం బోజ్య తండాకు చెందిన శ్రీను(38) మేడ్చల్‌కు బైక్‌పై వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో తెల్లవారుజామున ఇమాంపూర్ చౌరస్తా వద్ద డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

కొండపాక(గజ్వేల్): పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు .. కొడకండ్ల గ్రామానికి చెందిన బాలకిషన్(24) కొన్ని నెలలుగా జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగొద్దని తండ్రి నర్సింలు మందలించడంతో 8న వ్యవసాయ బావి వద్ద పురుగు మందు తాగి బావ పిట్ల మల్లికార్జున్‌కు ఫోన్ చేశాడు. వెంటనే అక్కడికి చేరుకున్న కుటుంబీకులు అపస్మారస్థితిలో ఉన్న బాలకిషన్‌ను 108 అంబులెన్సులో గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటో బోల్తా

మహిళా కూలీలకు గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

పాపన్నపేట(మెదక్): ఆటో బోల్తా పడి కూలీలకు గాయాలైన ఘటన మండల పరిధిలోని నార్సింగి గ్రామ శివారులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రమైన పాపన్నపేట చిన్న హరిజన వాడకు చెందిన 15 మంది మహిళా కూలీలు వరి నాట్లు వేసేందుకు వట్‌పల్లి మండలం బుడ్దాయపల్లి గ్రామానికి వెళ్లారు. నాట్లు ముగించుకొని సాయంత్రం స్వగ్రామానికి ఆటో తిరిగొస్తున్నారు. పాపన్నపేట శివారులోని దారి దేవుని ఆలయం వద్ద ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో ఆరుగురికి గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న పాపన్నపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ ను వివరణ కోరగా ఘటనపై ఫిర్యాదు అందలేదని తెలిపారు. ఆటోలో సుమారు 15 మంది కూలీలు ఉన్నట్లు సమాచారం.

ఆల్ఫాజోలం తయారీ ముఠా గుట్టురట్టు

- ఐదుగురు అరెస్ట్, మరో 9 మంది పరారీలో..
- తయారీకి అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో రూ.8 కోట్లతో పాత పరిశ్రమ కొనుగోలు
- వ్యాపారంతో ఏడాదికి రూ.20 కోట్ల వరకు సంపాదన
- సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్



తయారీ పరిశ్రమ ఫొటోలను చూపిస్తున్న ఎస్పీ చెన్నూరి రూపేశ్, తదితరులు

సంగారెడ్డి జోన్: నిషేధిత ఆల్ఫాజోలం డ్రగ్ తయారు చేసి అక్రమంగా సరఫరా చేస్తున్న ముఠా గుట్టు రట్టు చేశారు పోలీసులు. శనివారం జిల్లా కార్యాలయంలో ఎస్పీ చెన్నూరి రూపేశ్ కేసు వివరాలు వెల్లడించారు. మెదక్ పట్టణంలోని పిట్లం బేస్ గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడు గిర్మగొని సుధీర్ గౌడ్ పటాన్‌చెరు నియోజకర్గం పరిధిలోని ముత్తంగి గ్రామ శివారులోని తన్మయి హోమ్స్‌లో నివాసం ఉంటూ రియల్ ఎస్టేట్ చేస్తున్నాడు. తక్కువ సమయంలో అధిక డబ్బులు సంపాదించాలనే దురాశతో అతడి భార్య శ్రీవాణి, తమ్ముడు ప్రభుగౌడ్‌తో కలిసి 2017లో కానుకుంటకు చెందిన విశాల్ గౌడ్‌తో పరిచయం చేసుకొని కల్లులో కలిపే ఆల్ఫాజోలం తీసుకొని అమ్మేవారు. ఆ తర్వాత విశాల్ గౌడ్ ముత్తంగిలో నివాసం ఉండే ఒడిస్సా రాష్ట్రానికి చెందిన చెందిన బిశ్వేశ్వర్ సింగ్‌ను పరిచయం చేయించాడు. అప్పటి నుంచి అంతా కలిసి ఈ నిషేధిత ఆల్ఫాజోలం వ్యాపారం చేస్తున్నారు. కొద్ది రోజులకు బిశ్వేశ్వర్ సింగ్ ముత్తంగికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి రాజేశ్వర్ శర్మను సుధీర్‌గౌడ్‌కు పరిచయం చేయించాడు.


వ్యాపారానికి రూ.8 కోట్లతో పరిశ్రమ కొనుగోలు

ముగ్గురూ కలిసి 2023 మే నెలలో రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని బాచారం గ్రామ శివారులోని లక్ష్మణ్ గౌడ్ వ్యక్తి వద్ద సాయి ప్రియా కెమికల్ పాడుపడ్డ పరిశ్రమను సుమారు రూ.8 కోట్లకు కొనుగోలు చేశారు. రూ.2 కోట్లతో మరమ్మతులు చేశారు. బిశ్వేశ్వర్ సింగ్‌కి ఆల్ఫాజోలం తయారు చేసే పద్ధతి తెలియడంతో ఒక మిషనరీని ఏర్పాటు చేసుకున్నారు. సుధీర్ గౌడ్ డ్రైవర్ బోడ శశి కుమార్ సహాయంతో ఆల్ఫాజోలం తయారీకి కావాల్సిన ముడిపదార్థాలను తెప్పించేవాడు. వీరంతా నెలకు 1 నుంచి 2 బ్యాచ్‌లను తయారు చేసి కేజీ రూ.4 లక్షల చొప్పున హైద్రాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల్లో అమ్మి అధిక డబ్బును సంపాదించేవారు. ప్రధాన నిందితుడు సుధీర్‌గౌడ్ శుక్రవారం సాయంత్రం కారులో ఆల్ఫాజోలం అమ్మేందుకు ముత్తంగి నుంచి మెదక్ వెళ్తుండగా మంబాపూర్ వద్ద పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నారు. ఇతడు ఇచ్చిన సమాచారంతో భార్య శ్రీవాణి, బిశ్వేశ్వర్‌సింగ్, రాజేశ్వర శర్మజోషి, బోడ శశి కుమార్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి 740 గ్రాముల నిషేధిత ఆల్ఫాజోలం, 3 కార్లు, 6 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరంతా అక్రమంగా సుమారు రూ.60 కోట్ల వరకు ఆస్తులు సంపాదించినట్లు గుర్తించారు. ఆల్ఫాజోలం తయారీతో ఏడాదిలోనే రూ.20 కోట్లు సంపాదించినట్లు ప్రాథమిక అంచనాలో గుర్తించామన్నారు. మరో 9 మంది పరారీలో ఉన్నట్లు త్వరలో పట్టుకుంటామని వివరించారు. ముఠాను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, జిన్నారం ఇన్‌స్పెక్టర్ నయీముద్దీన్, గుమ్మడిదల ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి, సీసీఎస్ ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బందిని అభినందించారు.

దేవుడి దీపాలు అంటుకొని ఇల్లు దగ్ధం

- రూ.3.80 లక్షలు, 8 తులాల బంగారం, 25 తులాల వెండి కాలి బూడిద
- తొగుట మండలం చందాపూర్‌లో ఘటన

తొగుట(దుబ్బాక): భక్తి శ్రద్ధలతో దేవుడికి వెలిగించిన దీపాలే ఆ ఇంటికి శాపంగా మారాయి. పూజ గదిలో వెలిగించిన దీపంతో ఇంట్లో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైన ఘటన మండలంలోని చందాపూర్‌లో శనివారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబీకులు, గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నూనె మహేశ్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తుండగా, భార్య మౌనిక రోజూ కూలీ పనులకు వెళ్తుంది. శనివారం ఉదయం ఇంట్లో దేవుడికి దీపాలు వెలిగించి ఇంటికి తాళం వేసి పనులకు వెళ్లిపోయారు. ఈ క్రమంలో ఇంట్లో ఒక్కసారి మంటలు చెలరేగాయి. గ్రామస్తులు, మాజీ సర్పంచ్ బొడ్డు నర్సింలు గమనించి గజ్వేల్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలార్పే లోపు ఇల్లు కాలిబూడిదయ్యింది. ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు జాబితాలో మహేశ్ పేరుంది. దీంతో ఆయన ఇల్లు నిర్మించుకునే ప్రయత్నంలో భాగంగా బంధువుల వద్ద రూ.3 లక్షలు, భార్య పేరుతో మహిళా గ్రూపులో రూ.80 వేలు అప్పు తెచ్చుకొని ఇంట్లో దాచాడు. అలాగే భార్య 8 తులాల బంగారు ఆభరణాలు, 25 తులాల వెండి, బట్టలు, బియ్యం కాలి బూడిదయ్యాయి. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. సమాచారం అందుకున్న తొగుట ఆర్ఐ అశోక్‌రాజ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.


దీనంగా కూర్చున బాధితులు